

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.99,180
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,978
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,00,700
రిటైల్ వెండి గ్రాము	రూ.103.70

క్లుప్తంగా

ఎస్వీయూ ఎగ్జామినేషన్ డీన్‌గా సురేంద్రబాబు



వీసీ, రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సురేంద్రబాబు

తిరుపతి సిటీ: ఎస్వీయూ లైబ్రరీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ కె.సురేంద్రబాబును వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్‌గా నియమిస్తూ వీసీ అప్పారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్రబాబు వీసీ చాంబర్‌లో వీసీ, రిజిస్ట్రార్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎస్ కిషోర్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



కాంతమ్మ మృతదేహం

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ గెనుంగుట్ల పల్లెలో విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. వివరాలు.. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఆన్ చేశారు. అదే సమయంలో ఇంటి గేటును పట్టుకుని ఉన్న కాంతమ్మ(74)కు షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంట్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మరణించింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి గాయాలు



మరియమ్మకు కాలు విరిగిన దృశ్యం

పాకాల : మండలంలోని ఇరుగురురంగయ్యగారిపల్లె వద్ద బుధవారం రోడ్డు దాటున్న మరియమ్మ అనే వృద్ధురాలిని 104 వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియమ్మ కుడి కాలు విరిగింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



కర్ణాటకలోని పెట్రోల్ బంకులో ధరలు



కుప్పంలోని పెట్రోల్ బంక్‌లో ధరలు

తగ్గిస్తారా..

తప్పు ఒప్పుకుంటారా?

వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి దూకుడుకు కూటమి ప్రభుత్వం నానా అవస్థలు పడుతోంది. ఎన్నికల హామీల అమలులో మీనమేషాలు లెక్కిస్తున్న సర్కారును నిత్యం ఇరుకున పెడుతుండడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. మొన్నటికి మొన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై వినూత్న రీతిలో తెలిపిన నిరసనగా సమాధానం చెప్పుకోలేక సతమతమైంది. తర్వాత సూపర్ సిక్స్ హామీలను క్షేత్రస్థాయిలో ఎండగట్టడంతో కూటమి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయ్యింది. ఈ క్రమంలోనే యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ నాటకీయంగా చూపించిన పెట్రో ధరల విషయాలను గుర్తుచేస్తూ ఇరుకున పెట్టడంతో ఏం చేయాలో తెలియక తలపట్టుకుంటోంది.

- యువగళం హామీ హామీ అమలు చేయాలి
- పెట్రో ధరలు వెంటనే తగ్గించాలి
- లేకుంటే ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నారా లోకేష్‌కు భూమన అభినయ్ డిమాండ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : రాజకీయాల్లో విశ్వసనీయత ఉండాలంటే నేతలు మాట ఇస్తే దాని మీది నిలబడాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో యువగళం సందర్భంగా నారా లోకేష్ కర్ణాటక, ఆంధ్రలో పెట్రో ధరల మధ్య తేడాను చూపుతూ విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే పెట్రో ధరలు తగ్గిస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ సదరు హామీ అమలు కాకపోవడంతో భూమన అభినయ్ మండిపడ్డారు. బుధవారం వేకువజామున కర్ణాటకలో లోకేష్ వెళ్లిన పెట్రోల్ బంక్‌కే వెళ్లి పెట్రోల్ పట్టించుకున్నారు. ధర ఎంత ఉందో బహిరంగంగా ప్రదర్శించారు. వెంటనే కుప్పంలో లోకేష్ వెళ్లిన బంక్‌లోనే పెట్రోల్ తీసుకుని ధరను చూపించారు. కర్ణాటక కంటే కుప్పంలో పెట్రోల్ ధర ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన మాట మేరకు వెంటనే పెట్రో ధరలు తగ్గించాలని కోరారు. లేకుంటే తప్పు ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న అభినయ్, వైఎస్సార్‌సీపీ నేతలు



ఎన్టీఆర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి అర్బన్: తెలుగువారి ఆదర్శప్రాయుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా పేర్కొంటున్న ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రభుత్వ అధికారులు బుధవారం ఆయన జయంతి వేడుకలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ..

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని పరిపాలనా భవనం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, డీన్‌లు, అధ్యాపకులు ఘనంగా నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు నివాళులర్పించారు.

నేడు సీపీఎల్-1 ఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్-1) పోటీల్లో ప్రతిభ కనబరచిన పాయ్ వైస్రాయ్, హైపీరియన్ జట్లు ఫైనల్ చేరాయి. గురువారం మధ్యాహ్నం 1గంటకు జరిగే తుది పోరులో ఈ రెండు జట్లు తలపడనున్నాయి.

2 వికెట్ల తేడాతో హైపీరియన్ గెలుపు



ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న శుభశ్రీ

బుధవారం మధ్యాహ్నం 1గంటకు జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఆదిత్య లెవెన్స్, హైపీరియన్ జట్లు మధ్య మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. 3 బంతులు మిగిలి ఉండగానే 2 వికెట్ల తేడాతో హైపీరియన్ జట్టు విజయం సాధించింది. అంతకుముందు ఉదయం సీడీసీఏ ప్రెసిడెంట్, సెక్రటరీ జట్ల మధ్య ఉమెన్స్ జరిగిన ఎక్స్‌పోజర్ మ్యాచ్‌లో ప్రెసిడెంట్ ఉమెన్స్ లెవెన్ జట్టు 10 పరుగుల తేడాతో గెలుపొందింది. ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును శుభశ్రీ అందుకుంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 82,597 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,803 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

తుడాను సందర్శించిన ‘కాగ్’



అధికారుల సమావేశంలో కాగ్ బృందం

తిరుపతి తుడా : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ను బుధవారం కాగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వీసీ మౌర్య తుడా చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న అకౌంటింగ్ విధానాలను కాగ్ బృందానికి వివరించారు. డిజిటలైజేషన్‌కు తక్షణం చర్యలు చేపట్టాని కాగ్ కమిటీ అధికారులకు సూచించింది. సమావేశంలో అడిషనల్ డిప్యూటీ కాగ్ రీవూ ప్రకాష్, కాగ్ డైరెక్టర్ జనరల్ రష్మీ అగర్వాల్, డిప్యూటీ అకౌంటింగ్ జనరల్ ఎన్‌వీ నిఖిత, సీనియర్ డిప్యూటీ అకౌంటింగ్ జనరల్ ఆర్.శ్యామ్, తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి : పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకోబోగా ముగ్గురు పట్టుబడ్డారు. ఇద్దరు పరారయ్యారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నాలుగో నిందితుడు సురేష్(48)ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

సముద్రంలో మునిగి బాలిక మృతి



పల్లవి (ఫైల్)

కోట : మండలంలోని శ్రీనివాసనత్రం బీచ్‌లో బుధవారం సముద్రంలో మునిగి ఓ బాలిక మృతి చెందింది. వివరాలు.. స్థానిక మత్స్యకారుడు అక్కయ్యగారి లక్ష్మయ్య, సోమియా దంపతుల కుమార్తె పల్లవి(13) తిరుపతిలో చదువుకుంటూ వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. బంధువులతో కలిసి సముద్రస్నానానికి వెళ్లింది. అలల ఉధృతికి మునిగిపోయింది. సమీపంలోని మత్స్యకారులు వెంటనే బాలికను బయటకు లాగేశారు. అపస్మారకస్థితికి చేరడంతో హుటాహుటిన చింతవరం వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఎలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

జ్యూస్ ఫ్యాక్టరీలకు సహకారం

తిరుపతి అర్బన్ : జిల్లాలోని మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలకు సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి బ్యాంక్ అధికారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యజమానులు తీసుకున్న రుణాలను రీషెడ్యూల్ చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే ఫ్యాక్టరీ వారు సైతం మామిడి కొనుగోళ్లలో రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

టెంపో ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన సాధిక్‌బాషా

పాకాల : మండలంలోని దామలచెరువు వద్ద జాతీయ రహదారిపై టెంపో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కల్లూరుకు చెందిన సాధిక్‌బాషా(40) స్కూటీలో వస్తుండగా అక్కగార్ల ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న టెంపో వేగంగా ఢీకొంది. దీంతో సాధిక్‌బాషా అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రైతులకు సాంకేతికతపై అవగాహన



శ్రీనివాసులు, శాస్త్రవేత్త

రేణిగుంట : వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై గురువారం నుంచి అవగాహన కల్పించనున్నట్లు రాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఖరీఫ్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వినియోగించాల్సిన టెక్నాలజీని వివరించనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి

తిరుపతి సిటీ : సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్ లింక్ చేసుకోవాలని తిరుపతి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ బి.నరసప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల నగదు నేరుగా ఖాతాలో జమయ్యేందుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఖాతాదారులు వెంటనే సంబంధిత పోస్టాఫీసులలో సీడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు సచివాలయాల్లో జూన్ 4వతేదీ లోపు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

దేవుడి నిధులు స్వాహా!

ఆధ్యాత్మికతకు తిరుపతి జిల్లా పుట్టినిల్లు.. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆలయాలకు వచ్చే ఆదాయంతో ఆధ్యాత్మికతను మరింత పెంపొందించాల్సిన నేతలు ఇప్పుడు ఆలయ అధికారులను అడ్డు పెట్టుకుని తమ జేబులు నింపుకోవడం మొదలెట్టారు. పైగా సాంస్కృతిక కార్యక్రమాల మాటున రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అనధికార కమిటీలతో కలిసి కొందరు దేవదాయశాఖ అధికారులు కూడా ఆలయాల నిధులను దుర్వినియోగం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

- 11 నెలల పాలనలో ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కూటమి నేతలు
- అనధికారికంగా పలు ఆలయాలకు కమిటీల నియామకం
- ఆలయంలోకి అడుగిడగానే నిధులపై కన్ను
- ఆలయ నిధులతో ఏకంగా రికార్డింగ్ డ్యాన్సులు
- చూసీచూడనట్లు పోండయ్యా అంటూ అధికారులకు ప్రజాప్రతినిధుల సలహా
- అన్నింటిలో జోక్యం.. చేష్టలుడిగి చూస్తున్న పలువురు ఈఓలు

సిఫార్సు లేఖతో ఎంపిక చేసిన చైర్మన్ పేరిట ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధి



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోయినా..

ఆలయాల కమిటీలను దేవదాయశాఖ ఏర్పాటు చేయకపోయినా కూటమికి చెందిన నాయకులు అనధికారికంగా ఆలయ కమిటీల అధ్యక్షులతో పాటు సభ్యుల పేరిట ఫ్లెక్సీలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు వేయించి ప్రచారం చేసుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. దేవదాయశాఖకు చెందిన ఒక్క అధికారి కూడా దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధి ఇచ్చిన సిఫార్సు లేఖతో నియామకాలు చేయించుకుని ఆలయాల నిధులను దుర్వినియోగం చేస్తున్నారు.

చిల్లకూరు: జిల్లాలో ఆదాయం వచ్చే ఆలయాలపై కూటమి నేతల కన్ను పడింది. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అనధికారికంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. కొందరు ఈఓలు వారి పెత్తనాన్ని తట్టుకోలేకపోతుంటే.. మరికొందరు మాత్రం దొరికిందే అవకాశం అన్నట్లు ఆలయ నిధులను అనవసర కార్యక్రమాలు నిర్వహించి చేతివాటం చూపిస్తున్నారు. మామూలుగా అయితే ఆదాయం రూ.5 లక్షలకు మించి వచ్చే ప్రతి ఆలయాలకు ప్రభుత్వం పాలక మండలి కమిటీలను నియమిస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పటివరకు వీటి గురించి పట్టించుకోలేదు. అయితే కొందరు నేతలు మాత్రం తమ ప్రాంత పరిధిలోని ఆలయాలకు తామే కాబోయే కమిటీ అధ్యక్షుడిని అంటూ ఈఓలపై అప్పుడే పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో కొందరు ఈఓలు కూటమి నేతల పెత్తనాన్ని తట్టుకోలేక చేష్టలుడిగి చూస్తున్నారు. కొంతమంది ఈఓలు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని అనధికారిక కమిటీలతో కలసి చేతివాటం చూపిస్తున్నారు. అనవసర ఖర్చులు చేయిస్తూ దేవుడి నిధులను స్వాహా చేస్తున్నారు.

గూడూరు డివిజన్‌లో 23 ఆలయాలకు..

గూడూరు డివిజన్ పరిధిలోని గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో సుమారు 23 ఆలయాల్లో గత ప్రభుత్వం పాలకమండళ్లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని రద్దు చేయడంతో ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో ఉండే స్థానిక కూటమి నేతలు ఆలయాల్లో జరిగే జాతరలు, ఉత్సవాలు, పండుగలు నడిపించేందుకు పట్టుబడుతున్నారు. వారికి సపోర్టుగా స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చూసీచూడనట్లు పోండయ్యా అని దేవదాయశాఖ అధికారులతో చెప్పడంతో ఆలయ ఈఓలు మాకు ఏంటి ఈ ఖర్మ అనుకుంటూ వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారు.

బడ్జెట్ ఆమోదం పొందిన తరువాతే..

ఆలయ కమిటీల మెంబర్లమని చెప్పుకుంటున్న నేతలు ఆడిటర్లకు వాటాలు పంచుతూ కార్యక్రమాల్లో ఆధ్యాత్మికతను పక్కన పెట్టి రికార్డింగ్ డ్యాన్సు(ఈవెంట్)లు చేయించి ఇష్టారీతిలో భారీగా నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో గత నెలలో నాలుగు రోజుల పాటు జరిగిన జాతరకు ఆరు లక్షల మంది వరకు భక్తులు వచ్చారు. తద్వారా ఆలయానికి సుమారు రూ.కోటి వరకు ఆదాయం వచ్చింది. ఇదే మండలంలోని తమ్మినపట్నంలో కోదండరామస్వామి ఆలయానికి కూడా రూ.కోట్ల నిధులు ఉన్నాయి. మరి ఈ ఆలయంలో నవమి వేడుకలను నిర్వహించేందుకు దేవదాయశాఖ ఎన్ని రూ.లక్షల నిధులు విడుదల చేసిందనే విషయం తెలియదు. కానీ అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న కమిటీ ఆ నిధులతో పాట కచేరీలు, డ్యాన్స్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఆలయానికి కొత్తగా వచ్చిన ఈఓ కూడా నిధుల వినియోగంలో ఉన్నతాధికారులను ఏమార్చి భారీస్థాయిలో ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఎక్కడైనా రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేస్తే అడ్డుకునే పోలీసులు ఈ కార్యక్రమాలను దగ్గర ఉండి ప్రోత్సహించడం కొసమెరుపు. దీన్ని బట్టి దేవదాయశాఖ నిధులు ఎంత దుబారా చేస్తున్నారనే విషయం తేటతెల్లమవుతోంది.

జీఓ విడుదల చేయలేదు..

ఆలయాల్లో పాలక మండళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి జీఓ విడుదల చేయలేదు. కనీసం ఉత్సవ కమిటీలను కూడా నియమించేలా ఆదేశాలు అందలేదు. పలు ఆలయాల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించుకుంటున్న విషయం నా దృష్టికి రాలేదు. ఇలాంటివి ఏమైనా ఉంటే ఆయా ఆలయాల ఈఓలతో మాట్లాడి చర్యలు చేపడతాం. తమ్మినపట్నం కోదండరామస్వామి ఆలయంలో అనుమతులు లేకుండానే నవమి ఉత్సవాలకు భారీగా ఖర్చు చేసిన విషయాలు ఆర్‌జేసీ ఆజాద్ చూశారు. నాకు ఆ విషయం తెలియదు.

– రామకృష్ణారెడ్డి, దేవదాయశాఖ కమిషనర్, తిరుపతి



మల్లాం ఆలయానికి పాలకమండలి లేకపోయినా కమిటీ పేరిట రూపొందించిన క్యాలెండర్



శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన రికార్డింగ్ డ్యాన్సు

క్లుప్తంగా

గంగమ్మకు సారె సమర్పణ



సారెను సమర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో జరుగుతున్న గంగమ్మ జాతరకు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సారె సమర్పించారు. బుధవారం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సారె తీసుకువెళ్లిన ఆయన తనపల్లిలో జాతర నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు కర్పూర హారతులు పట్టి ఆహ్వానించారు. అనంతరం ఆయన నడివీధి గంగమ్మకు సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, తనపల్లి గ్రామ పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్ సింహ రెడ్డి, పార్టీ నేతలు దశరథ రామిరెడ్డి, హేమంత్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, హరి, సూరి తదితరులు ఉన్నారు.

ఉపసర్పంచ్‌కు పరామర్శ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి బైక్‌లో వెళ్తుండగా కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం స్విమ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగంలో చేరిన ఆయనను జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు విన్నవించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండల పరిధిలోని మైనారిటీ వర్గానికి చెందిన వారు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందించే రాయితీ రుణాలకు ద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సంఘమిత్రలు, పొదుపు సంఘాల లీడర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు సమావేశానికి హాజరై వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళిక తయారీ, యోగాంధ్ర రిజిస్ట్రేషన్ అమలు గురించి అవగాహన కల్పించారు. ఏపీఎం నాగేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



నెల్లూరు కృష్ణమూర్తిని సత్కరిస్తున్న కళాకారులు

తిరుపతి అర్బన్: పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేయడానికి అన్ని రాజకీయపార్టీల నేతలు సహకరించాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు, బూత్‌ల ఏర్పాటు తదితర అంశాలపై సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఓటర్ల జాబితా, బీఎల్‌ఓల పనితీరు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నేతలు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, డీటీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు కృష్ణమూర్తికి సత్కారం

తిరుపతి కల్చరల్: శ్రీగరుడా క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన కందుకూరి విశిష్ట పురస్కారం అందుకున్న రంగస్థలి, టీవీ, సినిమా, రేడియో కళాకారుడు నెల్లూరు కృష్ణమూర్తిని గురువారం జ్ఞాపికతో సత్కరించి అభినందించారు. ఎన్‌టీఆర్ జయంతిని పురస్కరించుకుని యూత్‌హాస్టల్లో కళాకారుడు నెల్లూరు కృష్ణమూర్తికి ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు.

మహానాడు సేవకు పారిశుద్ధ్య కార్మికులు

తిరుపతి తుడా: వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న టీడీపీ మహానాడులో సేవలందించేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పారిశుద్ధ్య కార్మికులు తరలివెళ్లారు. ప్రతి వార్డు నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 100 మంది కార్మికులను బుధవారం తెల్లవారుజామున బస్సుల ద్వారా తీసుకెళ్లారు. రెండు రోజులపాటు మహానాడు పరిసర ప్రాంతాల్లో వీరు పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టనున్నారు. రాజకీయ పార్టీ వేడుకలకు ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను పంపించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాడు ఇంటి వద్దకే రేషన్



నేడు : వృథాగా ఉన్న రేషన్ పంపిణీ వాహనం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావొస్తోంది. ఎన్నికలప్పుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేక చతికిలపడ్డారు. వలంటీర్లకు అదనంగా జీతం ఇవ్వడంతో పాటు ఆ వ్యవస్థను కొనసాగిస్తామని, వైఎస్ జగన్ కంటే మరింత మెరుగైన పాలన అందిస్తామంటూ ప్రజలను నమ్మించి.. ఓట్లు దండుకున్నారు.. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా.. ఇంకా సన్నాయి నొక్కులు నొక్కుతూ.. సీఎం దగ్గర నుంచి కిందిస్థాయి వరకు అవినీతి, అక్రమాలకు ఒడిగడుతూ.. నేరపూరిత పాలన సాగిస్తూ.. ప్రశ్నించిన వారిని వేధిస్తూ.. మూడు అక్రమాలు.. ఆరు అన్యాయాలు అన్నట్లు సాగుతోంది చంద్రబాబు పాలన.

- ప్రజలకు తప్పని రేషన్ కష్టాలు
- పింఛన్ కోసం పడిగాపులు
- అన్నదాతలకు అందని రైతు భరోసా
- తల్లులకు దండం పెట్టేశారు
- వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యంతో జనాలకు అగచాట్లు
- గత ప్రభుత్వమే మేలంటున్న జనం
- కూటమి ఏడాది పాలనపై అన్నివర్గాల నుంచి ఆగ్రహజ్వాలలు

ఏడాది పాలన.. అంతా నయవంచన

చంద్రగిరి : నమ్ముతున్నంత కాలం చంద్రబాబు నయవంచనకు గురి కావాల్సిందే. గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నంతకాలం కూడా జనాలకు ఏమీ చేయకుండా మోసగిస్తూ వచ్చారు. అహంకార పూరిత మనస్తత్వం కలిగిన ఆయన అధికారం రానంత వరకు జనం దగ్గరకు వెళ్లి మోకరిల్లి.. అబద్ధపు హామీలు ఇచ్చి.. అధికారం చేపట్టగానే తనలోని అసలు రూపాన్ని బయటకు తీస్తూ జనాలను మోసం చేస్తున్నారు. అధికారం చేపట్టింది మొదలు అన్యాయాలు.. అక్రమాలు.. అవినీతి.. ఇదే తంతు. ప్రశ్నించిన వారిపై అధికార జులుం చూపిస్తూ నయవంచన పాలన సాగిస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు మంచి చేయకపోగా.. మరింత ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారు. నిత్యం ప్రజలకు సేవలందించే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడంతో పాటు రేషన్ కోసం పడిగాపులు పడకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజాపంపిణీని రద్దు చేసి, సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. ఇక సూపర్‌సిక్స్‌కు ఎగనామం పెడుతూ నీచ పాలన సాగిస్తున్నారు. ఏడాది కూటమి పాలన లో వ్యవస్థలన్నీ నిర్వీర్యం కావడంతో గత వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన మంచిని గుర్తు చేసుకుంటున్నారు.

రైతు భరోసా కోసం ఎదురు చూపులు



గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఏటా పెట్టుబడి సాయం కింద రెండు విడతలుగా రూ.13 వేలను అందిస్తూ వచ్చారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఏడాది పాలన పూర్తి కావొస్తున్నా, ఒక్క రూపాయి కూడా అందించలేదు. ఇలా అయితే రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

– కేశవుల రెడ్డి, గడ్డకిందపల్లి, రామచంద్రాపురం మండలం

గతంలో రూ.18,500 అందేది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేయూత పథకం కింద మహిళలకు రూ.18,500 అందేది. ఒక రూపాయి కూడా తిరిగి ప్రభుత్వానికి కట్టనవసరం లేకుండా ఉండేది. కానీ టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మాకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదు.

– రాణి, ఐరంగారిపల్లి, పాకాల మండలం

నరకం కనిపిస్తోంది



గత ప్రభుత్వంలో ఇంటి వద్దే రేషన్ ఇచ్చేవారు. ఇప్పుడు నేను రేషన్ తీసుకోవడానికి 2 కి.మీ. వెళ్లాల్సి వస్తోంది. అక్కడ క్యూలో నిల్చోవాలంటే నరకం కనిపిస్తోంది. వృద్ధాప్యంలో ఉన్న నేను ఎంతసేపు క్యూలో నిల్చుకోగలను ? ఈ ప్రభుత్వం ఇంటివద్దే రేషన్ బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

– పార్వతమ్మ , ముద్దలపల్లి, పాకాల మండలం

మోసం చేశారు



అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి కూటమి నేతలు మోసం చేస్తున్నారు. నా భర్త నాలుగేళ్ల కిందట మృతి చెందడంతో పిల్లలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్నా. అమ్మఒడి అందించకుండా ఎగనామం పెట్టారు.

–డిల్లీరాణి, కొత్తవేపకుప్పం, రామచంద్రాపురం మండలం

ఫ్రీ బస్సు ఎప్పుడు ?



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావొస్తున్నా పింఛను మాత్రం పెంచి.. మిగిలిన ఏ ఒక్క హామీను అమలు చేయలేదు. అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి.. ఇప్పటికీ అమలు చేయలేదు. జగనన్నను కాదని, కూటమికి ఓట్లేసినందుకు మాకు సరైన గుణపాఠం చెబుతున్నారు.

– కమల, యల్లమ్మనాయనిపల్లి, పాకాల మండలం

మంచి ప్రభుత్వం కాదు..



కూటమి పాలన అధికారంలోకి వస్తే అట్టడుగు ప్రజలకు కూడా మేలు చేకూరుతుందని చెప్పి ఓట్లు దండుకున్నారు. గద్దెనెక్కారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీను నెరవేర్చని ఈ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఎలా అవుతుంది ? ఇది పూర్తిగా ప్రజలను నట్టేట ముంచిన ప్రభుత్వం.

– యారాశి ఓబుల్ రెడ్డి, చంద్రగిరి

నోటీస్ బోర్డు

- తిరుపతి పరిధిలోని ఈస్ట్ సెక్షన్‌లోని 33/11కేవీ ఫీడర్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెడ్డిరెడ్డి కాలనీ, దొడ్డాపురం, కేకే లేఅవుట్, టీకేస్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం
- టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు సుగుణమ్మ నివాసం నుంచి కడప మహానాడుకు భారీ ఎత్తున బస్సులు ర్యాలీ
- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు పెద్దకాపు లేఅవుట్‌లోని ఎస్ఎల్ఎస్ గ్రాండ్ హోటల్లో బీసీ ఆత్మగౌరవ సభ సన్నాహక సమావేశం
- శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయంలో ఉదయం 11 గంటలకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
- సీపీఎల్ క్రికెట్ సీజన్1 ప్రీమియం లీగ్ మ్యాచ్‌లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు లీగ్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్

ముందు జాగ్రత్తలతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి శైలజ

చంద్రగిరి: ముందు జాగ్రత్తలను పాటించడం ద్వారా మామిడి పంటల్లో తలెత్తే సమస్యలను పూర్తిగా నివారించడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి శైలజ అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని భీమవరం, పాకాల మండలంలోని దామలచెరువు, పదిపుట్లబైలు, మొగరాల గ్రామాల్లోని మామిడి పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులకు మామిడి పంటల్లో ఈగల నివారణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ..ప్రస్తుతం చాలా తోటల్లో మామిడి పక్వదశకు చేరువలో ఉన్నాయన్నారు. మే నెలలో కురిసిన వర్షాల కారణంగా పంట అనుకున్న సమయం కంటే 15 రోజుల ముందుగానే కోతకు రావడం జరిగిందని తెలిపారు. పండు ఈగ ఎర బుట్టల వివరాలకు రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఆత్మగౌరవ భరోసా సభ పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల హక్కుల సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ పూలే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 22న తిరుపతిలో బీసీ ఆత్మగౌరవ భరోసా సభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజగౌడ్ తెలిపారు. ఈమేరకు గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీసీ ఆత్మగౌరవ భరోసా సభ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో శుక్రవారం పెద్ద కాపు వీధిలోని ఎస్ఎల్ఎస్ గ్రాండ్ హోటల్లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 1న బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి ప్రచార రథ యాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘ నేతలు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

తిరుపతి తుడా: స్విమ్స్ కూడలిలోని అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్ అండ్ డైరెక్టర్ సంపత్‌కుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులతో కలసి ఆయన అన్నా క్యాంటీన్లలో పంపిణీ చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మట్లాడుతూ క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు.

కార్డియాక్ ఎంఆర్‌ఐపై అవగాహన



అవగాహన సదస్సుకు హాజరైన అతిథులు, వైద్యులు

తిరుపతి తుడా: స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియంలో బుధవారం కార్డియాక్ ఎంఆర్‌ఐ ప్రొటోకాల్ అప్లికేషన్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాదుకు చెందిన విస్టా ఇమేజింగ్ మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ విజయ భాస్కర్ విచ్చేసి అతిథి ఉపన్యాసం చేశారు. కార్డియాక్ ఎంఆర్‌ఐ సీక్వెన్స్, ప్రత్యేక ఇమేజ్‌లు, గుండె పనితీరును అంచనా వేసే విధానం, లోపాలు గుర్తించడం, రక్త ప్రసరణ వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, డాక్టర్ ఏవై లక్ష్మీ, డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ సరళ, రేడియాలజీ వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీరు ఆగకుండా చర్యలు



నగరంలో డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోతున్నాయని, సజావుగా వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో భాగంగా బుధవారం 12వ వార్డులోని ఎస్‌టీవీ నగర్, వెంకటరెడ్డి కాలనీ, గాంధీపురం, కెనడీనగర్, పాత తిరుచానూరు రోడ్డులో వివిధ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడినప్పుడు నీరు రోడ్లపై ఆగిపోతోందని ఫిర్యాదులు వచ్చాయని, ఇంజినీరింగ్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పలుచోట్ల మరమ్మతులకు గురైన డ్రైనేజీ కాలువలను సరి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వెంకటేశ్వర థియేటర్ వద్ద ఏర్పాటు చేయనున్న రైల్వే బ్రిడ్జి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఏసీపీ బాలాజీ, డీఈలు మహేష్, రాజు, శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

గృహాలు కూల్చిన వారిపై చర్యలకు డిమాండ్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరానికి కూతవేటు దూరంలో ఉన్న తిరుమల నగర్ పంచాయతీ వేణుగోపాల్ కాలనీలో సోమవారం 300 మందితో ఏడు జేసీబీలు, ట్రాక్టర్ తీసుకుని వెళ్లి ఇళ్లను ధ్వంసం చేసి నేల మట్టం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు కూల్చివేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందించారు. వారి సమస్య విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. వెంటనే జిల్లా ఎస్పీ, ఆర్డీఓ, తిరుచానూరు సీఐతో మాట్లాడి వెంటనే వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఆర్డీఓ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు.